# అందని జాబిలి

-పి.వి.డి.ఎస్. ప్రకాష్

ఆమెనే చూస్తున్నాడతడు కన్రెప్పలు వాల్చడం మరచి.

అప్పుడే తలారా స్నానం చేసిందేమో ఉదయ సూర్యకాంతిలో శిరోజాలను ఆరబెట్టుకుంటోందామె. దువ్వెనతో మెల్లగా దువ్వుతూ జుత్తును పాయలుగా విడదీస్తూ మధ్యమధ్యలో సుతారంగా దులుపుతూ ఆమె.

వాలుకుర్చీలో దినపత్రిక చదువుతున్న రీతిలో కళ్లతో ఆమె సౌందర్యాన్ని జుర్రేస్తూ మాధవ్. 'అదరహో, ఖజరహో' అతడి మనసు మత్తుగా మూలిగింది.

''ఎన్ని సుందర శిల్పాలకు ఈమె మోడలో?'' అనుకున్నాడు. పల్చటి తెల్లచీరలో దాగిన ఆమె శరీర సౌందర్యం అతడిని వెర్రెక్కిస్తోంది. ఆమె నిల్చున్న తీరులో నడుము దగ్గరపడ్డ మెలిక దగ్గర్నుంచీ అతడి దృష్టి దాటడంలేదు. ఆ మెలిక మధ్య అతడి గుండె పడి నలిగిపోతున్న భావన.

ఎన్ని వేటూరి పాటలు వింటే కలుగుతుంది ఈ మత్తు? ఎన్ని రాఘవేంద్రరావు సినిమాలు చూస్తే కలుగుతుంది ఈ ఆనందం? అనుకున్నాడతను తన్మయంగా.

ఇంతలో దువ్వెన కింద పడింది. ఆమె వంగి దాన్ని తీసుకోబోతుంటే భుజంపై నుంచి పైట జారిపోయింది.

'రవి కానని చోట కవి కాంచున్...' వెంటనే అతడికి ఆ వాక్యం గుర్తొచ్చింది.

అంతవరకూ రవిక బంధనంలో చిక్కుకున్న యవ్వన బంతులకు ఒక్కసారి స్వేచ్ఛ దొరికినట్టయింది.

సూర్యుడు చూసేసాడు ఆ అందాలను. సూర్యుడితోపాటు అతనూనూ.

దువ్వెన తీసుకుని పైట సర్దుకుని మళ్లీ యధాలాపంగా ఆమె తన పనిలో లీనమైంది.

''ఏమండీ? ఏం చేస్తున్నారు?'' లోపలనుండి శ్రీమతి కేక వినిపించి ఉలిక్కిపడ్డాడు మాధవ్.

పానకంలో పుడకలా మధ్యలో శ్రీమతి అనుకున్నాడు ఆ క్షణం.

''పత్రిక చూస్తున్నాను. చూసావా! నక్సలైట్లువెంత ఘోరం చేసారో? మందు పాతర పేల్చారట. ఇద్దరు పోలీసులు హతం'' అన్నాడు మాధవ్.

''సరే...సరే! ఎప్పుడూ వుండే బాగోతమే కదా ఇది. ఇదిగోండి కాఫీ. తాగి త్వరగా తెమలండి. ఆ తరువాత మళ్లీ ఆఫీసువేళయిందంటూ గోల పెడతారు.

గడగడ గుక్క తిప్పుకోకుండా మాట్లాడేసి ఒక్క అంగలో వంటింట్లోకి వెళ్లిపోయింది శ్రీమతి.

ముందుగా వినవచ్చిన కేకతో శ్రీమతి రాకను పసిగట్టిన మాధవ్ ముందు జాగ్రత్త చర్యగా ముఖానికి అడ్డం పెట్టుకున్న పేపర్ తీసి చూసాడు. ఎదురింటి మేడపై ఆమె కూడా లేదు. ఎప్పుడు వెళ్లిపోయిందో ఏమో?

★★★

ఒకసారి నైటీలో మరొకసారి పంజాబీ డ్రెస్‌లో మరోసారి తెలుగు చీరలో సౌందర్యాలు వెలుగు జిలుగు లొలుకుతూ రోజూ మాధవ్‌కి కావలసినంత కాలక్షేపం ఇస్తుందా సుందరి. పదేపదే ఆమె గుర్తుకొస్తుందతడికి.

ఇంట్లో ఉన్నా ఆఫీసులో ఏ ఫైల్ తిరగేస్తున్నా, ఉబుసుపోక సాయంత్రంవేళ అలా వాహ్యాళికి వెళ్లినా ఆమె రూపమే వెంటాడుతోందతడికి. పెళ్లయి రెండేళ్లు గడిచాయి.

శ్రీమతి అందమైనదే. పెళ్లిచూపులనాడు ఆమెను చూసేసరికి జయదేవుడి అష్టపది గుర్తొచ్చింది. పచ్చని పసిమిఛాయ. విశాలనేత్రాలు. వాటికి హద్దులు గీస్తూ సన్నని కాటుక రేఖ. నవ్వితే బుగ్గనపడే సొట్ట. పట్టుచీరలో ముడుచుకుకూర్చున్న అందాన్ని చూసి వెంటనే సొంతం చేసుకోవాలన్పించింది. అంతే-

మరో మూడు నెలల్లో వివాహవేడుక.

ఉదయం చుంబన సేవనం. మధ్యాహ్నం కౌగిలి భోజనం. సాయంత్రం పుష్ప నివేదనం. రాత్రికి-

ప్రతి రాత్రికి మహానైవేద్యంగా సాగుతోంది దాంపత్య జీవితం.

ఎలాంటి అరమరికలులేవు. పొరపొచ్చాలు అంతకన్నాలేవు.

ఏం దాచుకోదు ఆమె మనసులోనూ. రాత్రివేళ ఇటు శరీరంలోనూ.

'అర్ధనారీశ్వర తత్వం' బాగా అలవాటయిపోయింది. పెళ్లయిన ఏడాదికి కలలపంటగా పాప కూడా పుట్టింది.

ఇప్పుడు బాబు కోసం అన్వేషణ.

తలచుకున్నాడు మాధవ్.

అయితేనేం ఎదురింటి బొమ్మ ఊరిస్తోంది.

'ఇది ప్రేమా?' ప్రశ్నించుకున్నాడు మాధవ్.

'పెళ్లయితే అయింది. కానీ ప్రేమ ఇదే మొదలుకదా?' మరో ప్రశ్న.

అంటే-

ప్రేమ వేరు, పెళ్లివేరు.

ప్రేమ మానసికం. పెళ్లి దైహికం. ఇంకా విడమర్చి చెప్పాలంటే ఓ సామాజిక అవసరం. పెళ్లి అనే తంతు జరిగినంత మాత్రాన ప్రేమించకూడదని లేదోయ్ చవటాయ్ మనసు కసురుకుంది.

''అది సాధ్యమా? ఒక మగాడు ఒక ఆడది పెళ్లి పేరుతో సహజీవనం సాగిస్తుంటే మరో మనసు తలుపుతట్టి ప్రేమించాననడం భావ్యమా?''

అంతర్మథనం.

తాళి కట్టినంత మాత్రాన పెళ్లాం ప్రేయసి కాదోయి. ప్రేయసి వేరు. పెళ్లాం వేరు.

పెళ్లాం ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉండే అవసరం. ఆకలేసిందనుకో గబగబా లాగించేయవచ్చు. ప్రేయసి అలకాదు.

దూరాకాశంలో తారామణిహారం.

అందుకోవాలనే తపన, తాపత్రయంలోనే అసలైన థ్రిల్.

ఉస్సూరుమంది మాధవ్ హృదయం. తనెంత థ్రిల్ కోల్పోయాడో అర్థమైందతడికి.


నిజమే!

ప్రేమలోని థ్రిల్‌వేరు. పోటెత్తిన వయస్సు ఓ జత కోరుకుంటే-

సమాజం, పెద్దలు తమని గమనించకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ కలుసుకోవడంలోని థ్రిల్లే వేరు.

సంకేత స్థలంలో నేస్తం కోసం నిరీక్షణలోని కాలాన్ని ఖర్చు చేయాలంటే దిగులు.

ఆలస్యంగా వచ్చిన ప్రేయసి త్వరగా వెళ్లిపోతోందంటే ఆమె వచ్చిందన్న ఆనందం కన్నా మళ్లీ వెళ్లిపోతుందే అన్న ఆందోళనలో పెరిగే గుండె చప్పుడులోని మోహంలో ఒక



రకం థ్రిల్.

తానేం మిస్సయ్యాడో ఇప్పటికి అర్థమైంది మాధవ్కి.

ఆఫీసు వదలగానే సరాసరి ఇంటికి రాగానే ఓ చిర్నవ్వుతో కాఫీ అందించే శ్రీమతి గుర్తు రాలేదతడికి.

నెలలో మూడురోజులు తప్ప మిగిలిన రోజులు పాపం ఉపవాసముంటే పతికెక్కడ నీరసమొస్తుందనో బాధపడి సగభాగాన్ని సగర్వంగా అర్పించే శయనేషు రంభ శ్రీమతి గుర్తుకు రాలేదతడికి.

అవును-

తాళి బంధంలో సంసార చట్రంలో ఇరుకైన ఆమె ఎప్పుడంటే అప్పుడు దానికి సిద్ధమే. కానీ ఆమె-

ఆ సుప్రభాత సుందరి మళ్లీ గుర్తొచ్చింద తనికి. ఎలాగైనా ఆమెని పొందాలి.

తప్పో ఒప్పో జానేదేవ్. పెళ్లి పేరుతో ప్రేమను సమాధి చేసుకోవడంకన్నా మనసులో వరద గోదారిలా పోటెత్తిన తన ప్రేమను అతి రహస్యంగానైనా సొంతం చేసుకుని ఆ థ్రిల్ అనుభవించాలి. ఎవరూ కనిపెట్టలేని దొంగ ముద్దులోని తీపిని పదేళ్ల తర్వాత తలచుకుంటే మధుర జ్ఞాపకంగా మెదిలేలా ఇప్పుడే తను ప్రయత్నించాలి.

ఓ నిర్ణయానికి వచ్చాడు మాధవ్.

★★★

తండ్రి ఆరోగ్యం బాగాలేదని కబురొస్తే పుట్టింటికి వెళ్లింది శ్రీమతి.

ఉదయం టిఫిన్లో ఏం వేసుకోవాలో, మధ్యాహ్నం వంట చేసుకోకపోతే హోటల్లో ఎలా తినాలో, రాత్రి

పడక కుదరకపోతే ఎలా నిగ్రహించుకోవాలో సలహాల రూపంలో సకల జాగ్రత్తలు ఇచ్చి మరీ బస్సెక్కిందామె.

'ఇదే మంచి తరుణం మించిన దొరకదు' మనసు తొందరపెట్టసాగింది మాధవ్‌ని.

సాయంత్రం చలిగాలులు శరీరాన్ని వణికిస్తున్నాయి. నింగిలో ఈ పక్క నెలవంక అస్పష్టంగా కన్పిస్తోంది.

డాబామీద కూర్చున్నాడు మాధవ్. మళ్లీ ఓ పాత దినపత్రిక ముందేసుకుని ఎదురింటి పాప ఎప్పటికైనా మేడ ఎక్కకపోతుందా అన్న నిరీక్షణతో అలా దొంగచూపులు చూస్తున్నాడు. ఓ అరగంట తరువాత-

ఆరిన బట్టలు తీసుకెళ్లేందుకు ఆమె మేడ ఎక్కింది. సన్నగా గాజులు గలగల.

సన్నజాజుల పరిమళం.

గజ్జెల సవ్వడి. వెరసి వెన్నెల బొమ్మ.

ఆమె కొద్దిరోజులుగా ఇతడినే గమనిస్తున్నట్లుంది.

తేరిపార చూసింది.

''ఏమండీ...'' కంఠం నుంచి మాట పెగలడంలేదు మాధవ్‌కి. గొంతు తడారిపోయినట్లు భావన.

అతడినే పరీక్షగా చూస్తున్న ఆ పుత్తడిబొమ్మ కనుసైగ చేసింది.

దగ్గరగా, మేడమీద గోడ దగ్గరగా వెళ్లాడు మాధవ్. నడుస్తుంటే భయం. అడుగులు పడడంలేదు.

ఓ పిల్ల తండ్రి అయినా టీనేజ్‌నాటి కంపన. ఏమిటది? థ్రిల్. మనసు మూలిగింది.

దగ్గరగా వచ్చాడతను.

''మీ శ్రీమతి ఊళ్లోలేదా?'' అడిగిందామె. కోటి వీణలు మోగినట్లు మధురంగా వుంది ఆమె కంఠధ్వని మాధవ్‌కి.

''లే...లే... లేదు. ఊరెళ్లింది''

''అయితే ఉపవాసమన్నమాట''

''ఆ''

''అదే పస్తులు అన్నమాట''

''పస్తులెందుకు? హోటల్ వుందిక దా'' చెప్పాడు అయోమయంగా మాధవ్.

నవ్వింది గలగలా. జలతరంగిణి మోగినట్లు ఎంత మోహనంగా వుందా నవ్వు.

''మొద్దు...పిచ్చిమొద్దు'' మళ్లీ నవ్విందామె.


మల్లీ, జాజి మొగ్గలు కోసి రాశి పోసినట్లు -

''పిచ్చిమొద్దూ... ఉపవాసమంటే''

''ఉపవాసమంటే?''

అప్పుడు వెలిగింది మాధవ్‌కి ''ఓహో'' చిన్నగా నవ్వాడు.

ఒక్క-క్షణం తర్వాత ముసిముసిగా అంటున్నట్లు చెప్పిందామె. ''ఎందుకు తటపటాయిస్తున్నారు మీరు. నేను కావా లా మీకు?''




ఒక్కసారి ఆ ప్రశ్న వినేసరికి హతశుడయ్యాడు మాధవ్.

''నేను చూస్తున్నానులెండి మిమ్మల్ని చాలా రోజులుగా. పేపర్ చదువుతున్నట్లు నటిస్తూ దొంగ చూపులు మీరాను. ఈ ఇంటి పరిసరాల్లో నేనెక్కడ సంచరించినా మీ చూపులు నా వీపుకు గుచ్చుకుంటున్నాయి. ప్రేమకు భాష లేదండీ. కళ్లు మాట్లాడతాయి'' అంటోందామె.

''నిజమే. ప్రేమకు భాష లేదేమో? నేనేం మాట్లాడనవసరం లేకుండానే కార్యం సిద్ధించేటట్లుంది'' అనుకున్నాడతడు.

''ఓకే మీరేం కంగారుపడకండి. పడక కుదరడం లేదని. రాత్రి పదకొండు గంటల వేళకి మీ ఇంటి తలుపులు తెరిచి వుంచండి. నేను నెమ్మదిగా వచ్చేస్తా'' చెప్పిందామె.

ఆ పిల్ల స్పీడుకు ఆశ్చర్యపోతున్నాడు మాధవ్.

''నేను కావాలికదా మీకు?''

అవునన్నట్లు తలూపాడు మాధవ్. కానీ ఎలా కావాలి?

ఒక్కసారి పరిచయం కాగానే మొదటి మాట కలిసీ కలవగానే పతాక సన్నివేశమా? కేవలం శరీరాల పెనుగులాట కోసమా ఆమెని ఆరాధించింది? ఆ సంబంధం లేకుండా కొత్త ఆడదానితో కొద్ది క్షణాల ఏకాంతం, సంకేత స్థలాలలో నిరీక్షణం. దొంగచాటు వ్యవహారం లోని దొరతనం కోసం కించిత్ ఆరాటం.

''ఇదీ దొంగచాటు వ్యవహారమేకదా. సరాసరి పిల్ల వళ్లోకొచ్చి వాలుతుంటే వద్దంటావేం?'' కసురుకుంది మనసు.

పిచ్చి మనసు ఎప్పటికప్పుడు ఏదో వంకతో ఎదురుతిరుగుతుంటుంది. గట్టిగా గుండెని గదిమిపెట్టి మనసు గొంతు నొక్కాడు మాధవ్.

మేడ దిగి వెళ్లిపోతూ ఆ పిల్ల అంది ''అన్నట్లు చెప్పడం మరిచాను. రాత్రికి ఆరొందల రూపాయలు, అగరొత్తులు సిద్ధం చేయండి''

''ఆరొందలా?'' ఆశ్చర్యంగా అన్నాడు మాధవ్.

''ఆరొందలా? అలా పెట్టారేం మొహం. ఈ ఆడతనం మీ సొంతం కావాలంటే ఆపాటి ధనం త్యాగం చేయాలండీ. ఊరికే వచ్చేస్తుందేమిటి ఈ భామ?'' అందామె.

ఖంగుతిన్నాడు మాధవ్.

''అంటే...అంటే... మీరు?'' మిగతా మాటలు పూర్తి చేయలేకపోయాడు మాధవ్.

''అవున్సార్...నేనంతే'' అందామె నవ్వుతూ.

అంటే తన కలల రాణి, తన స్వప్నసుందరి...మాధవ్ మేడపైనే కూలబడ్డాడు.

★★★

ఇక జీవితంలో అతగాడు తనవైపు కన్నెత్తి చూడలేడు'' అనుకుందామె.


సిగ్గుపడుతూ తొలగిపోయే ఆడదంటేనే మగవాడికి మహా మక్కువ. ఆ సిగ్గు దొంతరలు చూసుకోవాలనే ఆత్రుత అధికమే.

మరీ సిగ్గు విడిచి 'వస్తావా? రమ్మంటావా?' అనే ఆడదంటే చాలు సిగ్గులేనిదంటూ ఓ ముద్రవేసి పరుగు లంకించుకుంటాడు ఈ మగవాడు.

శ్రీమతితో గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడిపించాలనుకునే ఈ పిరికి మగవాడు ఈ షాకుతో ఇక కోలుకోడు'' అనుకుందామె.

ఇక పత్రికల చాటు నుంచి దొంగ చూపులు బెడద అసలుండదు నిశ్చింతగా నిట్టూర్చిందామె.

★



## కృష్ణ వ్యాఖ్య

హీరో కృష్ణ తన కూతురు మంజులను 'సినిమా హీరోయిన్'ని చేస్తున్నాడు. జగపతిబాబు సరసన కోడిరామకృష్ణ దర్శకత్వంలో మంజుల నటిస్తోంది. ఆమధ్య మంజులను సినిమా హీరోయిన్‌గా పరిచయం చేస్తూ, కృష్ణ మాట్లాడిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా, చాలామంది బాధపడేలా చేసాయి. ''ఈమధ్య సినిమా హీరోయిన్లుగా గౌరవనీయ కుటుంబంలోని అమ్మాయిలు వస్తున్నారు. హిందీలో కరిష్మాకపూర్, తెలుగులో అక్కినేని మనుమరాలు సుప్రియ-ఇలా! ఇది చాలా ఆహ్వానించదగ్గ పరిణామం..'' అంటూ ఉపన్యసించారు. 'ఈమధ్య' అంటే, అంతకుముందు హీరోయిన్స్‌గా వచ్చిన వాళ్ళంతా గౌరవనీయ కుటుంబాలకు చెందినవాళ్ళు కాదనేనా?! ఆయన వ్యాఖ్యలు కొంతమంది హీరోయిన్స్- ముఖ్యంగా సీనియర్ నటీమణుల మనోభావాలు దెబ్బతీసే అవకాశం ఉంది. ఎవ్వరినీ నొప్పించకుండా మాట్లాడే కృష్ణ, ఈ విషయంలో ఎందుకు మాట జారారో అర్థం కావడం లేదు.

-జె.వి. బాబు